సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
90324 97123
నంబర్‌ను సంప్రదించండి

మా బడిని కాపాడండి

- వైర్లెస్ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రైల్వే శాఖ నోటీసులు
- 450 మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం
- కలగజేసుకోవాలని జిల్లా అధికారులకు విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజా సంఘాల వినతి


వైర్లెస్ కాలనీలో గల ప్రభుత్వ పాఠశాల ముఖద్వారం


పాఠశాల తరగతి గదులు

అల్లిపురం: మా బడిని కాపాడండి అంటూ వైర్లెస్ కాలనీలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా సంఘాల నాయకులు అభ్యర్థిస్తున్నారు. రైల్వే జోనల్ హెడ్ క్వార్టర్స్ నిర్మాణానికి స్థలం కావాలని, తక్షణమే పాఠశాల స్థలాన్ని స్వాధీనం చేయాలని కోరుతూ ఇటీవల పాఠశాల ప్రధానోపాధ్యాయులకు రైల్వే అధికారులు నోటీసులు పంపించారు. ఈ విషయం తెలుసుకున్న ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు, కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రాలు అందజేసి పాఠశాలను కాపాడాలని అభ్యర్థించారు.

1967 నుంచి పాఠశాల నిర్వహణ..
రైల్వేస్టేషన్ దరి వైర్లెస్ కాలనీలో గల పాత డీఆర్‌ఎం కార్యాలయంతో కూడిన ఖాళీ స్థలాన్ని 1967లో అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి పాఠశాల కోసం కేటాయించారు. రైల్వే ఉద్యోగులు తమ పిల్లలు చదువుకోవడానికి ఇక్కడ స్కూల్ ఏర్పాటు చేయాలని కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. దీంతో అప్పట్లో రైల్వే డీఆర్‌ఎం కార్యాలయంగా ఉన్న ఆ ప్రదేశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉన్నత పాఠశాల కోసం కేటాయించింది. 2014లో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పాఠశాలగా కొనసాగేందుకు రెన్యువల్ చేసుకుంది. ఈ మొత్తం వ్యవహారం రాష్ట్ర ప్రభుత్వం, రైల్వే ఉన్నతాధికారుల మధ్య జరిగింది.

పాఠశాలలో 450 మంది విద్యార్థులు..
పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను 450 మంది విద్యార్థుల అడ్మిషన్లు జరిగాయని ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణరావు తెలిపారు. ప్రస్తుతం రైల్వే శాఖ అధికారుల నిర్ణయంతో వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి..



విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. రైల్వే ప్రభుత్వ స్కూల్‌లో చదువుకుని ఎంతో మంది ఉన్నత పదవుల్లో ఉన్నారు. రైల్వేలో కూడా ఎంతో మంది అధికారులు ఉన్నారు. వారంతా పాఠశాల భవిష్యత్‌కు సహకరించాలి. స్కూల్ చుట్టుపక్కల గల మురికివాడలకు చెందిన విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుంటున్నారు. రైల్వే అధికారులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తమ ప్రతిపాదనను విరమించుకోవాలి. ప్రభుత్వ పాఠశాలను అక్కడే కొనసాగించాలి.

– కొత్తపల్లి వెంకటరమణ, పూర్వవిద్యార్థి, దళిత హక్కుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు

సీఎం కార్యదర్శి దృష్టికి నియోజకవర్గ సమస్యలు


నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ముఖ్యమంత్రి కార్యదర్శి కాల్వ ధనుంజయరెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

ప్రధాన సమస్యలివే..

- 30వ వార్డు పరిధి అంగటిదిబ్బలో 2.50 ఎకరాల స్థలంలో నివాసముంటున్న సుమారు 500 కుటుంబాలకు శాశ్వత పట్టాలు మంజూరు చేసి, ముస్లిం స్మశాన వాటికకు మధురవాడ ప్రాంతంలో 10 ఎకరాల స్థలం కేటాయించాలని కోరారు.
- పోర్టు కాలుష్యం పూర్తిగా నివారించేందుకు పర్మనెంట్ షెడ్స్ నిర్మాణం చేసి పొల్యూషన్‌కి గురవుతున్న దక్షిణ నియోజకవర్గ ప్రజలను కాపాడాలని కోరారు.
- 38వ వార్డు పరిధి రీడింగ్ రూమ్/కనకమహాలక్ష్మి ఆలయ ప్రధాన ఆర్చి నుంచి బీచ్ రోడ్డు వరకు విస్తరణ చేపట్టాలని కోరారు. ఘోషాసుపత్రికు వెళ్లే మార్గం చాలా చిన్నదిగా ఉండడం వల్ల చాలా ప్రసవాలు ఆటోలోనే జరిగిపోయి తల్లీ బిడ్డకు ప్రాణహాని జరిగిన సందర్భాలు ఉన్నాయని, ఈ రోడ్డు విస్తరణ వల్ల సుమారుగా 8 వేల కుటుంబాలు (40 వేల మంది ప్రజలకు), విశాఖ నలుమూలల నుంచి ప్రసవం కోసం వచ్చే వేలాది మంది గర్భిణులకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు.
- 30వ వార్డు పరిధి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపం ఆర్చి నుంచి కోడిపండ్యాల వీధి వరకు వెళ్లే మార్గం ఇరుగ్గా ఉండడం వల్ల ఏవీఎన్ కళాశాల యాజమాన్యంతో మాట్లాడి 30 అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరారు.
- ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులకు డీజిల్ ఆయిల్ సబ్సిడీ సుమారు రూ.3 కోట్లు మంజూరు చేయాలన్నారు.
- మత్స్యకారుల డ్యామేజ్ అయిన సుమారు 34 బోట్లు, హుద్‌హుద్‌లో నష్టపోయిన 63 బోట్లకు రూ.6 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించారో, అదే విధంగా నష్టపోయిన మిగిలిన వారికి నష్టపరిహారంగా సుమారు రూ.2.04 కోట్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.
- 33వ వార్డు వేంకటేశ్వరమెట్ట, 31వ వార్డు యల్లమ్మతోట ప్రాంతాల్లో నివాస గృహాల సమస్య పరిష్కారం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వేంకటేశ్వరమెట్ట ప్రాంతంలో సుమారు 150 ఏళ్లుగా 500 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, ఆ గృహాలకు సంబంధించి క్రయ, విక్రయ, గిఫ్ట్ డీడ్స్ రిజిస్ట్రేషన్లకు ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదన్నారు. అయితే 2003లో అప్పటి ఈవో, చైర్మన్, స్థానికుల మధ్య నెలకొన్న వివాదం కారణంగా ఆయా గృహాల స్థలం దేవదాయ శాఖకు చెందినదంటూ.. వాటిపై ఎటువంటి రిజిస్ట్రేషన్లు చేయవద్దంటూ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి లేఖ రాయడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయిందని వివరించారు. 2018 నుంచి 2021 వరకు తాను కృషి చేసి 53 గృహాలకు రిజిస్ట్రేషన్లు జరిపించినట్లు తెలిపారు. అయితే మరలా దేవదాయ శాఖ మెలిక పెట్టడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగిపోయిందని చెప్పారు. ఆ సమస్య పరిష్కరించాలని కోరారు.

సానుకూల స్పందన..
ఎమ్మెల్యే వివరించిన సమస్యలను క్షుణ్ణంగా విన్న సీఎం కార్యదర్శి ధనుంజయరెడ్డి సానుకూలంగా స్పందించి, సకాలంలో అమౌంట్స్ మంజూరు చేసి సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

క్లుప్తంగా

రోడ్డు పనులకు శంకుస్థాపన


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ నారాయణరావు, స్థానికులు

మహారాణిపేట : జీవీఎంసీ 29వ వార్డు వెంకటపతిరాజునగర్‌లో రూ. 11 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. వార్డు కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావు హాజరై పూజా కార్యక్రమాలతో పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ద్వారా తన వార్డులో సుమారు రెండు కోట్ల రూపాయలకు పైగా పనులు జరుగుతున్నాయని అన్నారు. ఇందుకు సహాయ సహకారాలు అందించిన ప్రభుత్వానికి, నగర మేయర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు కండిపల్లి సతీష్‌కుమార్, చొల్లంగి శేఖర్, సింగంపల్లి వెంకట్, సింగంపల్లి కొండలరావు, గండిబోయిన అప్పలరాజు, స్థానికులు పాల్గొని చాలా సంవత్సరాల తర్వాత వీధిలో రోడ్డు నిర్మాణం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

వృద్ధుడిని రక్షించిన పోలీసులు


వృద్ధుడిని రక్షించిన బీచ్‌గార్డులు

అల్లిపురం: పిల్లలు సరిగా చూడటం లేదని ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన వృద్ధుడిని మహారాణిపేట పోలీసులు రక్షించిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మద్దిలపాలెంలోని చైతన్యనగర్, కనకమ్మ గుడి దగ్గరలో నివసిస్తున్న శీరపు సూర్యనారాయణరెడ్డి అనే 65 సంవత్సరాల వ్యక్తి శనివారం నోవాటెల్ ఎదురుగా గల బీచ్‌లో ఆత్మహత్యా యత్నానికి పాల్పడుతుండగా మహారాణిపేట పోలీసులు, బీచ్ గార్డ్స్ అతనిని రక్షించి పెదవాల్తేరులో గల రెడ్‌క్రాస్ హోంకు తరలించి ఆశ్రయం కల్పించారు.

అమ్మవారి చీరల పంపిణీ


అమ్మవారి చీరలను మహిళలకు అందజేస్తున్న కమిటీ సభ్యులు

అల్లిపురం: మెయిన్‌రోడ్డులో గల రాచపోలమాంబ అమ్మవారి సతకం పట్టు 7వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దీంట్లో భాగంగా సాయంత్రం అమ్మవారి సతకం పట్టు వద్ద ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి సమర్పించిన చీరలను మహిళలకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు మద్ది విజయరెడ్డి, బొట్టా రమేష్‌రెడ్డి, పాల శంకరరావు, బోర తిరుమలరెడ్డి, పిల్లి శ్రీనివాస్‌రెడ్డి, నీలాపు వెంకటరెడ్డి, రవికుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసి న వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. గొల్ల సన్నిధి సేవ నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం 200 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వైభవుడిని దర్శించుకున్నారు.

న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌కుమార్

డాబాగార్డెన్స్: న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జాతీయ కార్యదర్శి కె. సురేష్‌కుమార్ కోరారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి నిర్వహించే జాతీయ మహాసభలు కేరళలో జరిగాయని, తమ సంఘం 1983లో ఆవిర్భవించిందన్నారు. తమ సంఘం నాయకులు పలు సమస్యలపై దృష్టి సారిస్తున్నారని చెప్పారు. కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తాను ఎన్నికైనట్టు చెప్పారు. అంతర్జాతీయ సంఘంలో దేశం నుంచి ఐఏఎల్ మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పారు. పలు కేసుల్లో న్యాయవాదులకు బెదిరింపులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా రూ.200 కోట్లు బార్ కౌన్సిల్‌కి కార్పస్ ఫండ్ కింద ఇవ్వాలని కోరారు. సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఐఎం అహ్మద్ మాట్లాడుతూ జడ్జీలతో పాటు న్యాయం కోసం పని చేస్తున్న న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరారు. కొన్ని కేసుల్లో వాదిస్తున్న లాయర్లకు రక్షణ ఉండడం లేదని వాపోయారు. న్యాయవాదుల పరిరక్షణకు చట్టం ఉండాలని కోరారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశ పెట్టాలన్నారు. రాజ్యాంగం ప్రకారం పేదలకు న్యాయం చేయడానికి లాయర్లు కృషి చేస్తున్నారని, లాయర్లు పలు ప్రజా ప్రయోజన పిటిషన్లు దాఖలు చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఎంఎన్ఎస్ భగవతి, రాష్ట్ర కార్యదర్శి అజయ్‌కుమార్, జాన్సీ, సుబ్బారావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం


బాధితులకు నగదు అందజేస్తున్న సుధాకర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెబాస్టియన్ కాలనీలో ఇటీవల హై టెన్షన్ విద్యుత్ తీగలు తగిలి మూడు పూరిళ్లు దగ్ధమైన ఘటనలో బాధితులను శనివారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ పరామర్శించారు. ప్రమాద బాధితులు ధనలక్ష్మి, మరియమ్మ, కనక మహాలక్ష్మి కుటుంబాలకు రూ. 5 వేలు చొప్పున అందజేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అధికారులతో మాట్లాడి ప్రభుత్వపరంగా సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉరుకిటి నారాయణరావు, చెన్నా జానకిరామ్, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి యాండ్రపు నిఖిలేష్ రాజ్‌కుమార్, గవర రమణ, వార్డు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న జహీర్ అహ్మద్ తదితరులు

జగదాంబ: స్వామి వివేకానంద సేవా సంస్థకు చెందిన విద్యార్థులు పదో తరగతిలో ఉత్తీర్ణత పొందిన సందర్భంగా ఉపాధ్యాయులను సంస్థ అధ్యక్షుడు జహీర్ అహ్మద్ ఘనంగా సత్కరించారు. శనివారం జీవీఎంసీ 39వ వార్డులో స్వామి వివేకానంద సేవా సంస్థకు చెందిన విద్యార్థులకు ఉచిత చదువుతో పాటు భగవద్గీత అధ్యయనం, సమ్మర్ క్యాంప్‌లో పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు, పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంస్థ తరఫున తనతో పాటు యువ నాయకుడు శ్రీవత్సవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ కొన్ని సంవత్సరాలుగా వేల మంది విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్ది ఉన్నత స్థానాల్లో నిలబెట్టినట్లు తెలిపారు. సత్యశ్రీ స్టడీ సర్కిల్ ఎండీ వాసు మాస్టర్ ఉచిత ట్యూషన్ ద్వారా సహకారం అందిస్తున్నారన్నారు. కంప్యూటర్ క్లాసులు కూడా ఉచితంగా నేర్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కుమార్, సత్తిబాబు, అప్పలకొండ, సంస్థ అధ్యక్షుడు అప్పారావు, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హైటెన్షన్ వైర్లతో ఆందోళన


అధికారులతో కలిసి హైటెన్షన్ వైర్లను పరిశీలిస్తున్న కోడిగుడ్ల పూర్ణిమ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి సెబాస్టియన్‌కాలనీ, బాబుకాలనీ, జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీ మీదుగా వెళ్లే హై టెన్షన్ వైర్లతో వార్డు ప్రజలు ఆందోళన చెందుతున్నారని కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ పేర్కొన్నారు. శనివారం ఆమె వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఇటీవల సెబాస్టియన్ కాలనీలో హైటెన్షన్ వైర్ల వల్ల మూడు పూరిళ్లు దగ్ధమైనట్లు తెలిపారు. హై టెన్షన్ వైర్లుండే స్తంభాలకు పాదలు పాకి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కంచరపాలెం జోన్–2 ఏపీఈపీడీసీఎల్ అధికారులతో కలిసి ఆమె వార్డులో పర్యటించి సమస్యలు గుర్తించారు. విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఉన్నతాధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు శ్రీధర్, వెళంగిణిరావు, శ్యామ్‌సుందర్‌రావు, ఆనంద్, కమల్‌కుమార్, ప్రసాద్, అన్నపూర్ణ, దేవి, ఈశ్వరి, అమలవతి, బాబ్జీ, రమేష్, తిరుమలరావు, కుమార్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సెలవులు పొడిగించాలి

సీతమ్మధార: ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పాఠశాలల వేసవి సెలవులు పొడిగించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం 'సాక్షి'తో ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో విద్యార్థులు తట్టుకోలేరని, ప్రభుత్వం పరిశీలించి ఎండ తీవ్రత తగ్గే వరకు మరి కొద్ది రోజుల పాటు సెలవులు పొడిగించాలని సూచించారు.

మతోన్మాదం నుంచి దేశాన్ని కాపాడుదాం


హాజరైన ప్రజా సంఘాల ప్రతినిధులు


మాట్లాడుతున్న కమిటీ వైస్ చైర్మన్ గోపీనాథ్

సీతంపేట: దేశాన్ని మతోన్మాదం నుంచి రక్షించి దేశ సంపదను కాపాడటమే భారత్ బచావో కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని కార్డియాలజిస్ట్, భారత్ బచావో జాతీయ కమిటీ వైస్ చైర్మన్ ఎం.ఎఫ్.గోపీనాథ్ తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం జరిగిన భారత్ బచావో జిల్లా సదస్సులో ముఖ్య వక్తగా ఆయన ప్రసంగించారు. నేడు హిందూ మతోన్మాదం ప్రమాదకరంగా మారిందని, దానికి కారణం ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలే అన్నారు. హిందూయిజం పేరుతో దేశంలో ప్రజల మధ్య విభేదాలు సృష్టించి హింసకు పాల్పడి అల్లకల్లోలం రేపుతారని నాడే పూలే, అంబేడ్కర్, స్టాలిన్ వంటి మహనీయులు హెచ్చరించారని గుర్తు చేశారు. ఆర్ఎస్ఎస్‌కు ప్రధాన శత్రువులు ముస్లింలు, క్రైస్తవులు, వామపక్షాలు, దళితులన్నారు. ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ బీజేపీ అధికారంలోకి వచ్చాక 2014 ముందు.. ఆ తర్వాత దేశ పరిస్థితిని సమీక్షించుకోవలసిన అవసరం ప్రజాస్వామ్య వాదులకు ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ తరుణంలో దేశాన్ని రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ మోదీ పాలనలో ప్రభుత్వ సంస్థలను ఒక్కొక్కటి అమ్మేస్తూ దేశ సంపదను కొద్ది మంది చేతుల్లో పెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో గూడూరు సీతామహాలక్ష్మి, చైర్మన్ సి.భాస్కరరావు, ప్రొఫెసర్ సత్యపాల్ పాల్గొన్నారు.

పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు


డాబాగార్డెన్స్‌లోని ఎంజీఎం హైస్కూల్లో పాఠ్య పుస్తకాలు భద్రపరుస్తున్న ఉపాధ్యాయులు


అల్లిపురం మోడల్ స్కూల్ వద్ద వ్యాను నుంచి పుస్తకాలు దించుతున్న హమాలీలు

- బడుల ప్రారంభం రోజునే పంపిణీకి ఏర్పాట్లు

అల్లిపురం: విద్యా సంవత్సరం (2023–24) ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ బుక్స్ పంపిణీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటికే దీనికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ ఆయా పాఠశాలలకు శనివారం చేరుకున్నాయి. గడచిన రెండు రోజులుగా నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేపట్టారు. నియోజకవర్గంలోని అల్లిపురం మోడల్ స్కూల్‌తో పాటు, బంగారుమెట్ట ప్రాథమిక పాఠశాల, డాబాగార్డెన్స్‌లో గల మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్, అచ్చియ్యమ్మపేట ప్రాథమిక పాఠశాల, వైర్లెస్ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రకాశరావుపేట ప్రాథమిక ఉన్నత పాఠశాల, ఆర్పీఎం హైస్కూల్, ఎంవీడీఎం హైస్కూల్, ఎంవీడీ హైస్కూల్, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, చెంగల్రావుపేట స్కూల్, వసంతబాల ప్రైమరీ స్కూల్స్, రెల్లివీధి స్కూల్, గణేష్ పాఠశాల, ప్రసాద్‌గార్డెన్స్, రాజారామ్‌మోహన్‌రాయి ప్రైమరీ స్కూల్ తదితర పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు వీటిని పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

'ప్రజలను మోసం చేసింది బీజేపీయే'

డాబాగార్డెన్స్: అనేక హామీలిచ్చి మోసం చేసిన పార్టీ ఏదైనా ఉందంటే అది భారతీయ జనతా పార్టీయేనని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ ఆరోపించారు. విశాఖ విచ్చేసిన ఆయన శనివారం పార్టీ కార్యాలయంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవిందరాజు అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి సాక్షిగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తానని చెప్పిన మోదీ తొమ్మిదేళ్లు కావస్తున్నా ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఎనిమిదేళ్లు ఏం సాధించారని విజయోత్సవాలు జరుపుకుంటున్నారో తెలపాలన్నారు. నెహ్రూ..ఇందిర వంటి ప్రధానులు ఇటుక ఇటుక పేర్చి ప్రభుత్వరంగ పరిశ్రమలు తీసుకొస్తే..అటువంటి ప్రభుత్వరంగ పరిశ్రమలను అంబానీ, ఆదానీలకు ధారాదత్తం చేస్తుండడంపై మండిపడ్డారు. సమావేశంలో గొంప గోవిందరాజు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వజ్జిపర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

రహదారి నిర్మించరూ..



నూనెమిల్లు వీధిలో శిథిలమైన రహదారి

జగదాంబ: నూనెమిల్లు వీధిలో రహదారి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్ దరి అన్ని వీధుల్లో బీటీ రోడ్ల నిర్మాణం జరిందన్నారు. ఈ వీధిలో మాత్రం ఇప్పటికీ నిర్మాణం చేయకపోవడంతో రహదారి గతుకులమయంగా మారిపోతుందన్నారు. వాణిజ్య కేంద్రం కావడంతో భారీ వాహనాల రాకపోకల కారణంగా రహదారి పూర్తిగా శిథిలమైపోతుందని, అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

డాల్ఫిన్ నోస్ రైల్వే కాలనీలో డీఆర్‌ఎం పర్యటన


రైల్వే కాలనీవాసుల విద్యుత్ సమస్యలు తెలుసుకుంటున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్

తాటిచెట్లపాలెం: డాల్ఫిన్ నోస్ రైల్వే కాలనీలో శనివారం డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి ఆకస్మికంగా పర్యటించి, అక్కడి ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ ప్రాంతంలో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తడంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఆయనకు తెలిపారు. విద్యుత్ కోతలకు గల కారణాలను సిబ్బందిని అడిగి డీఆర్‌ఎం తెలుసుకున్నారు. మరింత విద్యుత్ సరఫరా అవసరముందని గ్రహించి అధిక సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర పరికరాలను సమకూర్చుకోవాలని అధికారులకు ఆదేశించారు. మరి కొద్ది రోజుల్లోనే విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. విద్యుత్ ఆదాకు అవసరమైన పద్ధతులను కాలనీ వాసులు అవలంబించాలని సూచించారు. పర్యటనలో ఇతర అధికారులు, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
9010196663
Office mail : sakshiadvtvsp@gmail.com

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
7997958342, 9912440606